


# బల్దియాకు కేటాయింపులు ఎన్నో..?

**-రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పైనే జిహెచ్ఎంసి ఆశలు**
**-రూ.5వేల కోట్ల ప్రతిపాదనలు పంపిన అధికారులు**
**-నిధులు వస్తేనే అభివృద్ధి పనులు జరిగే అవకాశం**

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలోని ప్రజలకు సేవలందించే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి ) ఇప్పుడు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిహెచ్ఎంసికి ఎన్ని నిధులు కేటాయింస్తుందన్న దానిపై ఉత్కంఠగా ఎదురుచుచూస్తుంది. దీనిపై ఇప్పటికే వివిధ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి 5వేల కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. అయితే గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో సిఎం రేవంత్‌రెడ్డి జిహెచ్ఎంసికి 1100కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటివరకు ఎలాంటి పరిపాలన అనుమతులు జారీ కాలేదు. అయితే ఓట్ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించని 11ఐకోట్ల అంశం పక్కకుపోయిందని, ప్రస్తుతం ప్రభుత్వానికి నివేదిక అందించిన ప్రకారమే నిధుల కేటాయింపులు జరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు బిల్లులు, హెచ్‌సిటీ స్కీంలోని ఎస్ఆర్‌డిపి, ఎస్ఎన్‌డిపి, సిఆర్ఎంపి, డబుల్‌బెడ్‌రూం, జిఐఎస్, చెరువుల సుందరీకరణ, బేగంపేట్, రామకృష్ణాపురం ప్లైఓవర్ మరమ్మత్తులు, ఎల్‌బినగర్ ఫ్లైవర్‌లకు అదనపు ఖర్చులు ,ఆర్టీసి క్రాస్‌రోడ్‌లోని స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణానికి పెరిగిన వ్యయాన్ని చెల్లించాల్సి ఉంది.

**రూ.6,880కోట్ల అప్పులు...**

ఇప్పటికే గత సర్కారు అమలు చేసిన ఎస్ఎన్‌డిపి, ఎస్ఆర్‌డిపి ,సిఆర్ఎంసి వంటి అభివద్ధి పనులకు రూ.6,880కోట్ల అప్పులు చేసిన బల్దియా ఇకపై ప్రతికార్యకలాపాన్ని సాగించేందుకు సర్కారుపైనే ఆధారపడాల్సిన పరిస్థితులునెలకొన్నాయి. కొద్దినెలల క్రితం వరకు చేసిన అప్పులు మిత్తీలు చెల్లిస్తూ కాలం గడిపిన జిహెచ్ఎసి ప్రస్తుతం తీసుకున్న అప్పు మొత్తంలో నెలనెలా కొంత ఆసలును సైతం చెల్లించాల్సి వస్తుంది. అసలు మిత్తీలు కలిపి జిహెచ్ఎంసికి ప్రతినెలా సుమారు వందకోట్లు చెల్లింస్తుంది. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ల కింద నిధులు కేటాయిస్తే తప్పా బల్దియా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. మరోవైపు గతేడాది మే నెలనుంచి కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి రూ.1350కోట్ల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

అలాగే రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు చెందిన ఆస్తులకు సంబంధించిన ప్రాపర్టీ టాక్స్ రావడం లేదు. బకాయిలు వేల కోట్లలో పేరుపోయినా చెల్లించట్లేదని ,దీనికి తోడు జిహెచ్ఎంసి పరిధిలో వసూలు చేస్తున్న ప్రొఫెసనల్ ట్యాక్స్, మోటార్ టాక్స్‌తో పాటు స్టాంప్‌డ్యూటీ వసూళ్లలో జిహెచ్ఎంసికి రావాల్సిన వాటాను సైతం చెల్లించట్లేదని వీటన్నంటిని చెల్లిస్తే జిహెచ్ఎంసి ఖజానాను గాడిలో పెట్టొచ్చని చెబుతున్నారు.

# హైదరాబాద్ వార్త



## పాఠశాలల అభివృద్ధికి బాధ్యతగా పని చేయాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠశాల అభివృద్ధికి పోటీపడి బాధ్యతగా పని చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం బహద్దూర్‌పురా ఉమ్డా ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ అకస్మాత్తుగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల భవనాల అభివృద్ధి కోసం ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన టాయిలెట్, ఫ్లోరింగ్, కలర్ పెయింటింగ్, కుళాయిల ఫిట్టింగ్, తదితర విషయాలను గమనించి పాఠశాల పరిసరాలు పరిశీలించారు. ల్యాబొరేటరీని, ఆరో సెంటర్ స్టోర్ రూమ్ పరిశీలించి పాఠశాలలోని స్క్రాప్‌ను తొలగించాలన్నారు. వెనుకవైపు చెత్తా చెదారం పేరుకుపోయి ఉండడంపై ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాఠశాలకు హెచ్ఎండబల్యూఏ ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ హాజరు రిజిస్టర్ పరిశీలించి రికార్డులు అప్‌డేట్ చేయాలన్నారు. ఐఎస్ఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు డేటాని అప్‌డేట్ చేయాలని ఆపరేటర్‌కు చెప్పారు. విద్యార్థులందరికీ నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్, యూనీఫారాలు అందాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ముచ్చటించి వారి పేర్లను అడిగి తెలుసుకున్నారు. ఆవరణలో భవిత సెంటర్‌ను పరిశీలించి, అక్కడ మరింత వెలుతురు ఉండేలా అధనంగా 4ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఫిజియోతెరపీ డాక్టర్, ఉపాధ్యాయురాలి సేవలను ప్రశంసించారు. వారం రోజుల్లో రెండ్రోజులు స్పీచ్‌థెరపీ డాక్టర్ సేవలు అందేలా ఏర్పాటు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ కె.రోహిణి, డిప్యూటీ డీఈఓ ఏ.సత్యవతి, డిప్యూటీ ఐఓఎస్ ఖలీల్, డీఈ రాజన్న, హెడ్‌మాస్టర్ మహమ్మద్ రఫీ, తహసిల్దారు, ఏఈ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పదవులు ఆశచూపి లక్షలు కాజేసిన వ్యక్తిపై ఫిర్యాదు..

**-సెన్సార్ బోర్డు మెంబర్ పదవికి రూ.13 లక్షలు**
**-మరో పదవికి రూ.15 లక్షలు అంటూ బేరసారాలు**
**-కేంద్ర మంత్రులతో పరిచయాలు అంటూ బురిడీ**

**పంజగుట్ట, జూలై 24 (ప్రభాతవార్త):** రెండు తెలుగు రాష్ట్రాలలో పలువురు ప్రముఖులతో పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి లక్షలకు లక్షలు కాజేశారని ఓ వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూబ్లీహిల్స్‌లో ఉండే శశిధర్‌కు ప్రవీణ్‌రెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు కేంద్ర మంత్రుల దగ్గర నుంచి పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబధాలు ఉన్నాయని నమ్మ బలికాడు. ముందుగా సెన్సార్ బోర్డు పదవికి 13 లక్షలు అవుతాయని చెప్పాడు.మళ్ళీ సెన్సారు బోర్డు కాదు ఎఫ్‌సీఐ మెంబర్ పదవి ఇప్పిస్తాను దానికి 15 లక్షలు అవుతాయని చెప్పాడు.ముందుగా సెన్సారుబోర్డు మెంబర్ అని చెప్పి తర్వాత ఎఫ్‌సీఐ మెంబర్ అని చెప్పడంతో శశిధర్‌కు అనుమానం వచ్చి విచారించగా ఇది ఫేక్‌అని గ్రహించాడు. కేంద్రమంత్రి జయంత్‌చైదరి, ఏపీకి చెందిన ఓ కేంద్రమంత్రి, తెలంగాణాకు చెందిన వేరే రాష్ట్ర గవర్నర్‌తో మంచి పరిచయాలున్నాయని శశిధర్‌ను నమ్మించాడు. తీరా ఎంక్వయిరీ చేస్తే అవన్నీ కరెక్ట్ కాదని తేలడంతో బుధవారంజూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందింది. విచారణ చేస్తున్నాం మిగతా వివరాలు తర్వాత వెల్లడిస్తామని జూబ్లీహిల్స్ సీఐ వెల్లడించారు.

## వట్టినాగులపల్లిలో పెయింటింగ్ కాంట్రాక్టర్ దారుణ హత్య

**గచ్చిబౌలి, జూలై 24 ప్రభాతవార్త**

నగర శివారు పరిధిలోని వట్టినాగులపల్లిలో ఓ పేయింటింగ్ కాంట్రాక్టర్ దారుణ హత్యకు గురయ్యాడు. పేయింటింగ్ కాంట్రాక్టర్ వద్ద పేయింటింగ్ పనికోసం కూలీలుగా పనిచేస్తున్న వారికి డబ్బులు ఇవ్వకుండా వేదింపులకు గురి చేస్తుండడంతో అందులో ఓ వ్యక్తి కాంట్రాక్టర్‌ను దారుణంగా హత్య చేశాడు. తలపై సుత్తితో బలంగా కొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టినాగులపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహారాజ్‌గంజ్ జిల్లా సమర్‌ఘర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(44) మూడు నెలల క్రితం నగరానికి వలస వచ్చి వట్టినాగులపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికే చెందిన ఆరుగురు వ్యక్తులను తనతో పాటు తీసుకువచ్చి స్థానికంగా పేయింటింగ్ కాంట్రాక్టులు తీసుకొని వారితో చేయిస్తున్నాడు. పేయింటింగ్ కాంట్రాక్టులు తీసుకుంటున్న రాజ్‌కుమార్ భవన యజమానుల వద్ద డబ్బులు తీసుకొని కూలీలకు ఇవ్వకుండా వేదిస్తున్నాడు. ఈ విషయమై గతకొన్ని రోజులుగా కూలీలకు, రాజ్‌కుమార్‌కు మధ్య వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రాజ్‌కుమార్‌తో పాటు కూలీలు కలిసి వట్టినాగులపల్లిలో వారు నివాసం ఉంటున్న ప్రదేశంలో మద్యం సేవించారు. మద్యం సేవించే సమయంలో కూలీ డబ్బుల విషయమై మరోసారి గొడవ జరిగింది. అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో కూలీలు తమ గదిలో నిద్రపోగా, రాజ్‌కుమార్ ఇంటి వరండాలో నిద్రపోయాడు. కాగా అర్థరాత్రి సమయంలో కూలీల్లో ఒకరు రాజ్‌కుమార్ తలపై ఇనుప రాడ్‌తో కొట్టి దారుణంగా హత్య చేశారు. బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి వెనుక వైపు నివాసం ఉండే రాజస్థాన్‌కు చెందిన కూలీలు రాజ్‌కుమార్ మృతదేహాన్ని గమనించి ఇంటి యజమాని గబ్బర్‌సింగ్‌కు ఫోన్ చేసి చెప్పారు. గబ్బర్‌సింగ్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ఆరుగురు కూలీల్లో ఒకరైన రాంసింగ్ అనే వ్యక్తి రాజ్‌కుమార్‌ను హత్య చేసి ఉంటాడని ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కూలీలు అందరినీ పూర్తిగా విచారిస్తున్నామని, మిగిలిన వారి పాత్రపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

## డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..

**సంజీవ్‌రెడ్డి నగర్, జూలై 24, ప్రభాతవార్త**

సులభంగా డబ్బు సంపాదించాలని తప్పుడుదారులను ఎంచుకొని డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి 16 గ్రాముల (ఎండీఎంఏ) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శ్రీధర్, ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకట రమణ కలిసి వివరాలను వెల్లడించారు. మాథ్యూ సంజయ్ (23)అనే వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో బెంగళూరులో ఉండే తన స్నేహితుడు అసదుల్లా (25) డ్రగ్స్ సరఫరాదారుడు ద్వారా డ్రగ్ 1 గ్రాము కొనుగోలు చేసి హైదరాబాద్ నగరంలో రూ. 4500కు వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ముచ్చినపల్లి రాజ్‌కుమార్ అనే వ్యక్తికి ఎస్ఆర్ నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో డ్రగ్ విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు తెలంగాణ ఆంటీ నార్కోటిక్ బ్యూరో బృందంతో కలిసి వారిని పట్టుకొని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వారి వద్ద నుండి 16 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 1 సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని పెడ్లర్ మాథ్యూ సంజయ్, ముచ్చినపల్లి రాజ్ కుమార్‌లను రిమాండ్‌కు తరలించారు. సరఫరాదారుడు అసదుల్లా పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలిసిన వెంటనే తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111కి సంప్రదించాలని కోరారు.

## పచ్చదనం పెంపొందించాలి : ఎమ్మెల్యే వివేకానంద్

**పేట్ బషీరాబాద్, జూలై 24, ప్రభాతవార్త**

132 జీడిమెట్ల డివిజన్ ప్రసూన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, డిప్యూటీ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ కె.నాగేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో చెట్లను నాటి సంరక్షిస్తే పచ్చదనం పెంపొందుతుందని ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లాగౌడ్, విజయ హరీష్, గణేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన విఠోభా స్వామి బ్రహ్మోత్సవాలు



విఠోభా స్వామి పల్లకి సేవాలో పాల్గొన్న కమిటి ప్రతినిధులు

**బేగంబజార్, జూలై 24 ప్రభాతవార్త:** భక్తుల కోరికలు తీర్చే ఆలయంగా జంగల్ విఠోభా స్వామి(పాండురంగస్వామి) బ్రహోత్సావాలు బుధవారం అంగరంగ వైభవంగా ముగిసాయి. ఉస్మాన్‌షాహి విఠల్‌నగర్‌లో ఉన్న చారిత్రాత్మకమైన ఆలయంలో ఆషాడ మాసం ఏకాదశి పూజలతో ప్రారంభమైన పాండురంగ స్వామివారి బ్రహ్మోత్సవాలు పల్లకి సేవాతో ముగించాయి. బుధవారం తెల్లవారు జామున శ్రీస్వామి వారిఅవబృత స్నానము(చక్రస్నానము)ఇమ్లీబన్ జగన్నాథ స్వామి మఠం వరకు గరుడ వాహనముపై పాండురంగ. మహిళలు పాండురంగస్వామి భక్తి గీతాలను ఆలపించారు. పాండురంగస్వామి, రుక్మాబాయిలకు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం గీతాలను ఆలపించి మహిళలతో కలిసి కోలాహటం ఆడారు. ఈ కార్యక్రమంలో బాలభక్త సమాజ్ అధ్యక్షులు. వి.కిషన్ యాదవ్, చైర్మన్ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పి.మాణిక్ రావు, ఉపాధ్యక్షులు, కె.రాజుమహరాజ్, కోశాధికారి వి.పాండు యాదవ్, ఉపాధ్యక్షులు బి.బోయిని వెంకటేష్‌యాదవ్ వందలాదిమంది భక్తులు, పాల్గొన్నారు.

## గోషామహల్‌లో ఘనంగా బోనాలు ఉత్సవాలు

**గోషామహల్, జూలై 24ప్రభాతవార్త:**

ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతియేటా గోషామహల్‌లో నిర్వహించే బోనాల ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దేవాలయంలో బిజెపి సీనియర్ నాయకులు డి.గోపాల్‌జీ పాల్గొన్ని ప్రత్యేకపూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి బోనాల సమర్పించారు.

## మత్తు పదార్థాలు సేవిస్తే ఆర్నెల్లకైనా దొరుకుతారు

**-డ్రగ్స్ నివారణకు అన్ని చర్యలు : ఎసిపి వెంకటగిరి**

**పంజగుట్ట, జూలై 24 ప్రభాతవార్త :**

డ్రగ్స్ సేవించిన వారు ఆరు నెలల తర్వాతైనా టెస్ట్ లో దొరికితే కేసునమోదు చేస్తామని జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ పరిధిలో ముప్పయికి పైగా పబ్‌లు ఉన్నాయని, వీటిలో డ్రగ్స్ సేవిస్తున్నారనే సమాచారం వస్తే వెంటనే దాడులు చేయడం జరుగుతుందన్నారు. పబ్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు. ఒకఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో వారంలో నాలుగు రోజులు స్నిప్పర్ డాగ్స్ సాయంతో పూర్తిగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ డాగ్స్ మత్తు పదార్థాలు ఎక్కడున్నా వాసన సాయంతో గుర్తు పడతాయన్నారు. పబ్‌ల యాజమాన్యంకంటే పబ్‌లలో పని చేసే జాకీలపైనే ఎక్కువగా అనుమానం ఉందని, వారు సంపన్నుల పిల్లలను పబ్‌ల బయటే లోబరుచుకుని పబ్‌లలో డ్రగ్స్ సేవించేలా ప్రేరేపిస్తారనే అనుమానం తమకు ఉందని, ఆ దిశగా కూడా తాము నివారణా చర్యలు చేపట్టామని తెలిపారు. పబ్‌లలో ఈవెంట్స్ నిర్వహించుకునే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్స్ గతంలో దేశంలో ఎక్కడైనా పబ్‌లలో ఈవెంట్స్ నిర్వహించారా? వారికి ఏవిధమైన బ్యాగ్రౌండ్ ఉందో తెలుసుకుని అనుమతులు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. వీకెండ్స్ లో పబ్‌లలో క్రౌడ్ ఎక్కువగా ఉంటుందని కనుక ఆ రెండు రోజులు ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. పబ్‌లలో తరచుగా యూరిన్, రక్త నమూనాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. యూరిన్ శాంపిల్స్ తీసుకుని వెంటనే పాజిటివ్ వచ్చిన విషయాన్ని స్పాట్‌లోనే నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. గత ఆరు నెలల క్రితం మత్తు పదార్థాలు సేవించినా యూరిన్ టెస్ట్‌లో పాజిటివ్‌గా వస్తుందని, అలా పాజిటివ్‌వచ్చినా వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. గత రెండు రోజుల క్రితం ఈ విధంగా టెస్ట్‌లు చేసి పలువురిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.

## జియాగూడలో అగ్నిప్రమాదం ..ఇద్దరు మృతి

**-పట్టించుకోని కార్మిక శాఖ,స్థానిక పోలీసులు**
**-ప్రమాదం జరిగినప్పుడే హడావిడి**

**గోషామహల్, జూలై24 ప్రభాతవార్త :** అర్ధరాత్రి వేళ్లలో ఓ సోఫా తయారీ గౌడౌన్‌లో అగ్ని ప్రమాదం సంభవించి మంటలంటుకుని ఒకే కుటుంబంలోని నలుగురు గాయాలకు గురికాగా, తండ్రి, కూతురు తీవ్రగాయాలకు గురై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషాధ సంఘటన బుధవారం అర్ధరాత్రి కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... వివరాలు ఇలా ఉన్నాయి. జియాగూడలోని వెంకటేశ్వర కాలనిలో కార్మిక శాఖ నియమ నిబంధనలకు విరుద్దంగా నాలుగు అంతస్థుల భవనంలో సోఫాతయారీ గౌడౌన్‌లో సోఫా, కుర్చీలు తయారు చేస్తున్నారు. మరో ఇద్దరు తీవ్రగాయాలకు గురై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భవన యాజమాన్ని ధనుంజ బన్సల్‌కు చెందిన నాలుగుఅంతస్థుల భవనంలో బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సోఫాతయారీ గోదాం ఉంది. రోజు మాదిరిగానే పనులను పూర్తి చేసుకుని గాడనిద్రలో ఉన్నారు. అందులో పని చేసే శ్రీనివాస్ ఉంటున్న రూమ్‌లలో సోఫా తయారీకి సంబంధించిన మెటీరియల్ పెట్టారు. శ్రీనివాస్‌తోపాటు భార్య నాగరాణి, కుమార్తెలు శివప్రియ, హరిణిలు ఉన్నారు. సోఫా మెటీరియలకు మంటలంటుకుని చెలరేగాయి. అయితే రూమ్‌లో ఉన్న శ్రీనివాస్ కుటుంబం బయటకు రాలేకపోయింది. అప్పటికే మంటలంటుకుని చెలరేగుతున్నాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపకదళానికిసమాచారం అందించారు. ఐనప్పటికి స్థానికులు స్పందించి మంటలంటుకుని ఉన్న శ్రీనివాస్, భార్య నాగరాణి, కుమార్తెలను హరిణి, శివప్రియలను బయటకు తీశారు. అప్పటికే శ్రీనివాస్, శివప్రియలకు మంటలంటుకుని తీవ్రగాయాలకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్యులు వారికి వైద్యం చేస్తుండగా శ్రీనివాస్, శివప్రియలు మరణించారు. వారి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రస్తుతం నాగరాణి, హరిణిలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసును కుల్సుంపురా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జియాగూడలో విచ్చల విడిగా జననివాసాల మధ్య చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. అనేక సార్లు కుల్సుంపురా పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న కుటీరపరిశ్రమలలో మంటలు అంటుకున్న దాఖాలు అనేకం ఉన్నాయి.

అసలు కార్మికశాఖ, పోలీసు శాఖలు ఏమి చేస్తున్నారో అర్థం కాని పరిస్దితి నెలకొందని స్థానిక ప్రజలు అంటున్నారు.

## గ్రీన్ లైటు పడ్డా .. పోలేని పరిస్థితి

**-పలుప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ -అసహనానికి గురవుతున్న వాహనదారులు**

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా ట్రాఫిక్‌పై సిబ్బంది పర్యవేక్షణలు చేస్తున్నా గానీ, నగరంలోని పలు సందర్భాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతూనే వస్తోంది. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ సిగ్నల్ వద్ద బుధవారం మధ్యాహ్నం కొద్ది నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఐమ్యాక్స్ రోడ్ నుంచి ఖైరతాబాద్ సిగ్నల్ వరకూ కిలోమీటర్ పైన ట్రాఫిక్ జామ్ అవ్వడం వల్ల ఫ్లైఓవర్ మొత్తం వాహనాలతో నిండిపోయింది. ఈ క్రమంలో ఫుట్‌పాత్‌ల మీద నుంచి కొన్ని ద్విచక్రవాహనాలు పోయే ప్రయత్నంలో మార్గ మధ్యలో ఉన్న చెట్ల వల్ల బండిని కిందకి దింపలేని పరిస్థితి ఏర్పడింది. ఫ్లైఓవర్ మీద నుంచి పంజాగుట్ట వైపు వెళ్ళే వాహనదారులకు గ్రీన్ సిగ్నల్ పడినా వారు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దాంతో సహనం కోల్పోయిన ప్రజలు ఎదురుగా స్థంభించిపోయి ఉన్న ట్రాఫిక్‌లోని ఇతర వాహనదారులపై హారన్ మోతలతో విరుచుకు పడ్డారు. గ్రీన్ సిగ్నల్ పడిన మరుక్షణమే వాహనాలను దూకించే అలవాటున్న నగర వాసులు, ఒక్కసారిగా ట్రాఫిక్ జామ్ అవ్వడంతో అసహనాన్ని వ్యక్తం చేశారు. కాగా రెడ్ సిగ్నల్‌ను దాదాపు 60 నుంచి 100 సెకన్లు ఉంచే ట్రాఫిక్ సిబ్బంది, గ్రీన్ లైటు పడితే 30 నుంచి 40 సెకెన్లకే తీసేస్తున్నారని, ఫ్లైఓవర్ మీదనుంచి కిందకొచ్చేలోగా రెడ్ సిగ్నల్ పడిపోవడంపై వాహనదారులు మండి పడుతున్నారు. ఈ క్రమంలో పలు రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం కనిపిస్తోంది. తాజాగా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు యువకులు ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీద ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, బండి స్కిడ్ అయి జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం జరిగింది. ఇకపోతే తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద ట్యాంక్ బండ్ రోడ్ వద్ద హిమాయిత్‌నగర్ సిగ్నల్ దాటాలంటే 10 నిమిషాల సమయం పడుతుంది. హబ్సిగుడా జంక్షన్‌లో సిగ్నల్ దాటేందుకు దాదాపు 5 నుంచి 8 నిమిషాలు పడుతుంది. సికింద్రాబాద్ నుంచి బేగంపేట వైపు వచ్చే వాహనాలైతే నెమ్మదిగా ఆగుతూ వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలో ప్రధానమైన ట్రాఫిక్ సమస్య జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్దే కనిపిస్తుంది. ఇక్కడ ఐటీ కారిడార్‌కు వెళ్ళే వాహనదారులు దాదాపు 5 నుంచి 10 నిమిషాలు ఆగాల్సి ఉంటుంది. మెహిదీపట్నం నుంచి బంజారా హిల్స్ వెళ్ళేందుకు అత్తాపూర్ మలుపు వద్ద సిగ్నల్ దాటాలంటే పలు సందర్భాలలో 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. సిగ్నల్ వద్ద ఎక్కువ సేపు ఆగడం వల్ల పెట్రోల్ త్వరగా పూర్తయిపోతోందని ద్విచక్రవాహనదారులు చెబుతున్నారు. అశోక్ నగర్, గాంధీనగర్ వద్ద ఇరుకుగా ఉండే రోడ్లలో కూడా ఆర్టీసీ బస్సులు రావడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ సిగ్నల్ వద్ద జామ్ అయిన ట్రాఫిక్‌లో అధికంగా ప్రైవేటు బస్సులు, సిటీ బసుస్సలు నిలిచిపోవడంతో జనం అసహనానికి గురయ్యారు. ట్రాఫిక్‌లో ఎక్కువగా చిక్కుకుపోవడం వల్ల నగర పౌరులు కాలుష్యం బారిన పడి ఆరోగ్యం పాడు చేసుకుంటున్న విమర్శలు నిరంతరం వస్తూనే ఉన్నాయి.

ఆగని వర్షం కారణంగా ఈ ట్రాఫిక్ జామ్‌లు సంభవిస్తున్నాయని, వాహన దారులు మితిమీరిన వేగంతో డ్రైవ్ చేయద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

**-ముగ్గురు సస్పెండ్, మరో ముగ్గురు బదిలీ**

**కంటోన్మెంట్, జూలై24ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాల్లో మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయం అతి పెద్దది ఈ మండలం పరిధిలో వేల కోట్ల రూపాయల విలువ ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటితో పాటు అత్యధిక మురికివాడలు ఉన్నాయి. అయితే సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తహశీల్ధార్ పద్మసుందరి, ఎం.ఆర్.ఐ.ప్రసన్న లక్ష్మి, రికార్డు అసిస్టెంట్ రవిలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. గత నెల 20న ససస్పెండ్ చేశారు. వారి స్థానంలో ఇంత వరకు ఎవరిని భర్తీ చేయలేదు. అదే విధంగా డిప్యూటీ తహశీల్ధార్ ఏ.శివకుమార్‌ను మేడ్చెల్ మల్కాజిగిరి బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ మద్దూర్ మల్లేశ్వర్ రెడ్డిని సంగారెడ్డికి, జూనియర్ అసిస్టెంట్ డి.వంశీ ధర్ తిరుమగిరి మండలానికి బుధవారం బదిలీ అయ్యారు. మండల తహశీల్ కార్యాలయంలో కీల కమైన తహశీల్ధార్, డిప్యూటీ తహశీల్ధార్, ఎం.ఆర్.ఐ, సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్‌లు, తహశీల్దార్ తో పాటు 5 మంది లేక పోవడంతో వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే అటు ప్రజలు, ఇటు రెవెన్యూ సిబ్బంది లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి మారేడ్‌పల్లి తహశీల్ కార్యాల యంలో ఖాళీగా ఉన్న పోసస్టులను తక్షణమే భర్తీ చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు

## నగరంలో గాడిద గుడ్డు పోస్టర్లు




**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో గాడిద గుడ్డు పోస్టర్లు హల్‌చల్ చేస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో బస్ స్టాప్‌లు, జంక్షన్ల దగ్గర ఈ పోస్టర్లు దర్శనం ఇస్తున్నాయి. కేంద్ర బడ్జెట్ మీద సెటైర్లు వేస్తూ, బీజేపీకి తెలంగాణ ఎనిమిది ఎంపీ సీట్లిస్తే, కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ తెలంగాణకి ఏమిచ్చింది? అనే కొశ్చన్‌తో గాడిద గుడ్డు అనే సమాధానం హైలైట్ చేయగా డిజైన్ చేయబడ్డ గార్ధభాండం పోస్టర్లు నగర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. కాగా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే ప్రస్తావనకి తీసుకురాకపోవడం ఒకపక్క అయితే, రాష్ట్రానికి నయా పైసా ఇవ్వలేదంటూ అధికార కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, చేవేళ్ళ... ఈ మూడు లోక్ సభ స్థానాల్లో బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదనంగా ముషీరాబాద్‌కు చెందిన లక్ష్మణ్ రాజ్య సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరి దేశంలో కీలకమైన మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ మహానగరానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దక్కింది కేవలం 'గుండు సున్నా!' అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో నగరంలోని ప్రధాన కూడళ్ళలో గాడిద గుడ్డు పోస్టర్లు దుమారం రేపాయి.

పార్లమెంట్ ఎన్నికల సమయంలో పదేళ్ళుగా అధికారంలో ఉన్న మోడీ సర్కార్ తెలంగాణకు గాడిద గుడ్డు తప్ప ఏమీ చేయలేదని ప్రచారం చేసిన కాంగ్రెస్, తాజాగా ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌పై మరోసారి గార్ధభాండం సెటైర్లు వేస్తూ చర్చ లేపింది.

## ఇష్టారాజ్యంగా రోడ్డు తవ్వకాలు

### ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



రోడ్డు తవ్విన దృశ్యం

**ఎల్.బి.నగర్, జులై 24 ప్రభాతవార్త :** ఇష్టరాజ్యాంగా రోడ్డు తవ్వకాలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. కొత్త మంచినీటి నల్ల కోసం అనుమతులు తీసుకొని ఇష్టారాజ్యంగా రోడ్లు ఉండడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ రోడ్ నార్త్ రోడ్డు నెంబర్ 4లో ఓ నల్ల కనెక్షన్ కోసం ఎవరి అనుమతి లేకుండా రోడ్డును తవ్వారు. ఇటువంటి తవ్వకాలు కోకొల్లలుగా జరగడంతో రోడ్లు పూర్తిగా పాడవుతున్నాయి. నల్ల అనుమతి తీసుకున్న వారు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో రోడ్డు తవ్వకానికి సంబంధించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే జలమండలి, ఇంజనీరింగ్ విభాగం శాఖలోని కొందరు అవేమీ పట్టించుకోకుండా చేతివాటాన్ని ప్రదర్శిస్తూ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి పైప్ లైన్లు నిర్మిస్తున్నారు. కాలనీలలో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మిస్తే జలమండలి ఇంజనీరింగ్ విభాగాలలోని కొందరు తమ జేబులు నింపుకుంటూ నల్ల కనెక్షన్ ఇచ్చే క్రమంలో రోడ్లను ఇష్టారాజ్యంగా తొవ్వేస్తున్నారు. రోడ్లను తవ్వి తిరిగి వాటిని మామూలుగా పూజ చేయడంతో రోజురోజుకు తొవ్విన రోడ్లు పెద్ద గొయ్యిలుగా మారుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై జోనల్ కమిషనర్, ఉప కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి కారకులను వారిపై చర్య తీసుకుని ఇష్టానుసారంగా రోడ్లు తవ్వకుండా చర్యలు చేపట్టాలని పలువురు కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి : ఉప కమిషనర్ సుజాత



రిక్షా అందజేస్తున్న ఉప కమిషనర్ సుజాత

**ఎల్.బి.నగర్, జులై 24 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రత విషయంలో కాలనీవాసులు భాగస్వాములు కావాలని సరూర్ నగర్ డివిజన్ ఉప కమిషనర్ సుజాత సూచించారు. సరూర్ నగర్ డివిజన్ వేంకటేశ్వర కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త సేకరించే రిక్షా ను ఉప కమీషనర్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు కాలనీ పరిశుభ్రత కొరకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్చార్జి నీలిమ, ఎస్ఎఫ్ఏ శ్రీను, కాలనీ ప్రెసిడెంటు మారోజు శ్రీనివాసరావు, కోశాధికారి సాయికిరణ్, మధుసూదన్ రెడ్డి, విజయ కుమార్, నరేష్, సుధాకరచారి, ఎంవిఎస్.ప్రసాద్, మురళీ కౌండిన్య, కనకారావు, వెంకట సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు ఒకటి నుంచి నిత్య యోగ సాధన

**ఎల్.బి.నగర్, జులై 24 ప్రభాతవార్త:** కొత్తపేట హుడా కాంప్లెక్స్‌లోని లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్లో ఆగస్టు ఒకటి నుంచి నిత్య యోగ సాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగ గురువు ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ఒకటవ తేదీ నుంచి ప్రతిరోజు సాయంత్రం గంట పాటు నిత్య యోగ సాధన నిర్వహిస్తామన్నారు. అధిక బరువు, బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, అస్తమా తదితర సమస్యలు యోగ సాధన ద్వారా పరిష్కారమవుతాయని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మల్లాపూర్ డివిజన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రక్తదాన శిభిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్,కార్పోరేటర్ పన్నాల

**నాచారం, జులై 24 ప్రభాతవార్త:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కౌండిన్య భవనంలో బుధవారం స్థానిక కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ఆపద సమయాల్లో ఎంతో మందికి రక్తం దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతారని అలాంటి వారి కోసం ఇలాంటి శిబిరాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం రక్తదానం చేసిన పులువురి యవకులకు హెల్మెట్లను పంపిణీ చేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## గ్రేటర్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో బోనాలు



సమావేశంలో మాట్లాడుతున్న అమరేశ్వర్, నందకిషోర్ తదితరులు

**మలక్‌పేట, జులై 24 ప్రభాతవార్త:** మలక్‌పేట జిహెచ్ఎంసి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిహెచ్ఎంసి తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్, అనుబంద సంస్థ ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ నందకిషోర్ అధ్యక్షతన ఉపాధ్యక్షుడు కొరుడు అమరేశ్వర్ పర్యవేక్షణలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితిగా వస్తుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ట్రాన్స్‌పోర్ట్ కమిటీ అధ్యక్షుడిగా పోచన్న...** మలక్‌పేట ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ కమిటీ అధ్యక్షుడిగా పోచన న్నను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్క రాజేష్, మల్లికార్జున్, దిలీప్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ బండారు శ్రీవాణి



డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, జులై 24 ప్రభాతవార్త :** రామంతాపూర్ ఇందిరానగర్ మెట్ల గల్లీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జలమండలి డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ కిషన్ తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాన రహదారిలో ఉన్న స్వాగత్ గ్రాండ్, లేక్‌వ్యూ బార్ నుంచి వ్యర్థాలు అలాగే డ్రైనేజీలో వేస్తున్నారని, వీరిని నోటీసులు జారీ చేసి జరిమానా వేస్తున్నామని ఆమె తెలిపారు. హోటల్, బార్ నిర్వహకులు ప్రత్యేకంగా చాంబర్ ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే మెట్ల నుంచి శేఖర్ బస్తీ వరకు డ్రైనేజీ లైన్లు వేస్తామని, కొత్త సిసి రోడ్డు వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పూస సత్తయ్య, ఆదినారాయణగౌడ్, వేదవతి, రాపోలు రాములు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయానికి రూ.1.51 లక్షల విరాళం



కమిటీకి విరాళం చెక్కును అందజేస్తున్న పోరెడ్డి భాస్కర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 24 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 17వ డివిజన్ జిల్లెలగూడ మెయిన్ రోడ్డులోనున్న ప్రధాన పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి కార్పొరేటర్ పోరెడ్డి పద్మ భర్త పోరెడ్డి భాస్కర్‌రెడ్డి తన వంతుగా రూ.1.51 లక్షలను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆలయానికి విచ్చేసిన ఆయన ప్రతిష్టాపన పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయకమిటీకి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్త మధుసూదన్‌రెడ్డి, మల్లెల నరేందర్‌రెడ్డి, జిల్లెల దామోదర్‌రెడ్డి, సప్పిడి యాదిరెడ్డి, కుంటల వల్లభ్‌రాజ్‌గౌడ్, బొక్క అంజిరెడ్డిలతో పాటు పోరెడ్డి జంగారెడ్డి, పోరెడ్డి సుధాకర్‌రెడ్డి, పోరెడ్డి సురేందర్‌రెడ్డి, అర్కల కాశీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: యెల్మేటి అమరేందర్‌రెడ్డి



ఆలయాన్ని సందర్శించిన కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 24 ప్రభాతవార్త:** బాలాపూర్ గ్రామంలో బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బాలాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన బుధవారం స్థానిక కాటమయ్య కంఠమహేశ్వరస్వామి, సూరమాంబ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర జరిగిన తర్వాత హైదరాబాద్‌తో పాటు బాలాపూర్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జూకంటి సురేష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, అరవింద్‌గౌడ్, ధన్‌రాజ్ గౌడ్, వంగేటి మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపేందర్‌గుప్తకు కోడి రామకృష్ణ అవార్డు



ఉపేందర్ గుప్తకు అవార్డు అందజేస్తున్న మురళీమోహన్

**ఎల్.బి.నగర్, జులై 24 ప్రభాతవార్త:** ప్రముఖ సినీ దర్శకుడు కోడి రామకృష్ణ పేరిట ప్రతిష్టాత్మక అవార్డును ఫిలిమ్ బోర్డు సభ్యుడు డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ లభించింది. అవార్డును బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ, మాజీ మంత్రి, టీజీ.వెంకటేష్, ప్రముఖ సినిమా హీరోలు మురళిమోహన్, సుమన్, కవిత, దివ్యవాణి, నిర్మాత రాంసత్యనారాయణరాజు, కార్పొరేషన్ చైర్మన్ సుజాతలు ఉపేందర్ గుప్తకు అందజేశారు.

## గౌడ సంఘం బోనాల సందర్భంగా పూజలు

**సరూర్‌నగర్, జులై 24 ప్రభాతవార్త:** బాలాపూర్‌లోని అంజిరెడ్డికాలనీలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల పండుగ సందర్భంగా బుధవారం స్థానిక శ్రీ కంఠ మహేశ్వర స్వామి, సూరమాంబ ఆలయాన్ని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నగర పంచాయతీ/మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డిలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కమిటీ సభ్యులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఈ నెల 28న శ్రీ దుర్గా పోచమ్మ బోనాలు

**వనస్థలిపురం, జులై 24 ప్రభాతవార్త:** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని బిఎన్‌రెడ్డి నగర్ శ్రీ దుర్గా పోచమ్మ దేవాలయంలో ఈ నెల 28న దుర్గా పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ ముద్దగౌని శేఖర్‌గౌడ్, అధ్యక్షుడు ముద్దగౌని జ్ఞానేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కారింగి ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం జరిగే బోనాల పండుగలో ఉదయం 5గంటలకు అమ్మవారికి అభిషేకం,మధ్యాహ్నం 12గంటలకు మహా నైవేద్యం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితర, రాత్రి 9.30 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సాహెబ్‌నగర్‌లోని ఆలయ కమిటీ ఛైర్మన్ ముద్దగౌని శేఖర్‌గౌడ్ నివాసంనుండి పలహార బండి పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు.

## ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో హామీలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



ఉప్పల్ భగాయత్‌లో సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, జులై 24 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో గతంలో హెచ్ఎండిఏ అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు అసోసియేషన్ నేతలు బుధవారం డిప్యూటీ కమిషనర్ అంజనేయులును కలిసి విన్నవించారు. ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూధన్‌రెడ్డి, మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, మేకల హనుమంతరెడ్డి, సల్ల రాజిరెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, సల్ల వీరారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, ఒక్కింటి శ్రీనివాస్‌రావు, పిసాటి అంజిరెడ్డి, పిల్లి నాగరాజు, బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నగేష్, కాయ హనుమంతు, రంగ భాస్కర్, శివ, జహంగీర్ తదితరులు పాల్గొని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతుల నుంచి భూములు తీసుకున్న హెచ్ఎండిఏ అధికారులు లేఅవుట్ చేసే సమయంలో 2500 గజాల స్థలంలో కమ్యూనిటిహాల్, ఐదు ఎకరాల స్థలంలో స్మశానవాటిక, 8 ఎకరాల స్థలంలో ఇండోర్ స్టేడియం, స్విమింగ్ పూల్, క్లబ్ హౌజ్, ఓపెన్‌జిమ్, రైతు బజారు కేటాయిస్తామని స్థలాలు తీసుకున్నారని, వీటిని అభివృద్ధి చేయడం లేదన్నారు. గతంలో హెచ్ఎండిఏ కమిషనర్‌ను కలిసి సమస్యలు విన్నవించామని, ప్రస్తుతం లేఅవుట్ జిహెచ్ఎంసి స్వాదీనం చేసుకున్న నేపధ్యంలో మౌళిక సదుపాయాలు కల్పించాలని వారు విన్నవించారు. దీనిపై త్వరలోనే హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసితో సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం

**రామంతాపూర్, జులై 24 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కోటేష్, కోఆర్డినేటర్ కరిపె అనిల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు అశోక్, నరేంరాజు, సత్యనారాయణరెడ్డి, చింటూ, మహేందర్‌రెడ్డి, నరేష్, ఇంద్రసేనారెడ్డి, విశాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు. ఇటీవల ఎన్నికల్లో ఎనిమిది మంది ఎంపిలను గెలిపిస్తే ఒక్క పైసా ఇవ్వలేదని ఆరోపించారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ఆగస్టు 6 నుంచి 10 వరకు శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాలయ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, సభ్యులు

**సైదాబాద్, జులై 24 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్‌లో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఆగస్టు 6వతేదీ మంగళవారం నుండి 10వ తేదీ శనివారం వరకు ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, స్థానికులు ఆవిష్కరించారు. చాముండేశ్వరి గురుదత్త పీఠం వ్యవస్థాపకులు, మైసూరు అవధూత దత్తపీఠంఆస్థాన విద్వాంసులు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ బ్రహ్మత్వంలో విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6వతేదీ నుంచి 9వ వరకు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10వ తేదీ శనివారం ఉదయం శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

**ఆగస్టు 11న బోనాల పండుగ...** ఆగస్టు 11వ తేదీ ఆదివారం శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాలపండుగను, 12వ తేదీ సోమవారం సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపును ఘనంగా నిర్వహించనున్నారు. నూతనంగా పునః నిర్మించబడిన దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన, బోనాల పండుగకు ప్రతి ఒక్కరు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవాలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ కోరారు.

## పరిశుభ్రత పాటించిన కాలనీకి రూ.5లక్షలు

**ఉప్పల్, జులై 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో పరిశుభ్రత పాటించిన కాలనీలకు ప్రభుత్వం రూ.5లక్షల నిధులు ఇస్తుందని ఉప్పల్ డిసి అంజనేయులు తెలిపారు. ప్రజలు తమ కాలనీలో ప్రతి ఒక్కరు చెత్తను ఆటోకు ఇవ్వాలని, అద్దెకు ఉండే వ్యక్తులతో కూడా చెత్త వేయించాలని సూచించారు. సంత వ్యాపారులు కూరగాయల చెత్తను వేయకుండా చూడాలని, ఖాళీ ప్రదేశాలలో చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జోనల్ కమిషనర్ ప్రత్యేకంగా ఉప్పల్ సర్కిల్‌లోని బస్తీలకు ఆఫర్ ఇస్తున్నారని, కాలనీ సంక్షేమ సంఘం నేతలు ముందుకు వచ్చి దీనిని అమలు చేయాలని సూచించారు. ఇప్పటికే చెత్త వేసే ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలు కాలనీ నేతలు చెప్పిన విధంగా ఖర్చు చేస్తారని తెలిపారు.

## సమాజానికి సేవలు అందిస్తాం : స్వప్న



ప్రొఫెసర్ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యక్షురాలు స్వప్న తదితరులు

**మలక్‌పేట, జులై 24 ప్రభాతవార్త:** సమాజానికి తమ వంతు సేవలు అందిస్తామని హైదరాబాద్ గంగోత్రి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వల్లెం స్వప్న పేర్కొన్నారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఓయు కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ లయన్ డాక్టర్ అశోక్‌కుమార్, ఉపాధ్యాయురాలు ఈనా తదితరులు స్వప్న సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ అశోక్‌కుమార్ పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడంతో పాటు ఇసిస్ చేస్తున్న విద్యార్థులకు సహకారం అందిస్తున్నారని కొనియాడారు. తమ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, సత్యనారాయణరావు, యాదయ్యగౌడ్, పిఆర్‌కె నాగరాజు, లక్ష్మీ మేంద్రాచారి, ఆర్‌సి ఆనంద్ చక్కిల, జెసి వల్లెం భరత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జులై 24 ప్రభాతవార్త:** బి.యన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్‌కెడినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పరిమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అంతేకాకుండా ఎత్తు పల్లాలను సరి చూసుకొని రోడ్డు వేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరేందర్ తేజ, కాలనీ అసోసియేషన్ సభ్యులు సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, బొమ్మ రఘురాంనేత, అమరేందర్‌రెడ్డి, వెంకటరమణ, టెంపుల్ వైస్ ఛైర్మన్ కృష్ణారావు, నాయకులు అశ్విన్, బీజేవైఎం సెక్రటరీ సురేష్‌కుమార్, సాయి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలి : ఉద్యమకారుల ఫోరం



ఎమ్మెల్యే కూనమనేనితో మాట్లాడుతున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

**తుర్కయాంజాల్, జులై 24 ప్రభాతవార్త:** రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ సిపిఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావును మంగళవారం హైదరాబాదులో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు ఉద్యమకారుల సమస్యలతోపాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాంబశివరావు సానుకూలంగా స్పందించి తప్పకుండా ఉద్యమకారుల సమస్యలను అసెంబ్లీలో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, ఇంద్రకుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి లయన్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

**సరూర్‌నగర్, జులై 24 ప్రభాతవార్త:** జిల్లెలగూడ గీతాంజలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ నేత్రాలయ కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆర్‌సిఐ లయన్స్ క్లబ్ భవనంలో ఏరా ్పటు చేసిన కంటి వైద్య శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఐడ్రాప్ ్స వేశారు. కార్య క్రమంలో దీప్‌లాల్‌చౌహాన్, కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, లయన్స్ కిషన్‌రెడ్డి, డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డి,మహేందర్‌రెడ్డి, హరిబాబు, సూరసాని భాస్కర్‌రెడ్డి, అంజయ్య, సుధాకర్‌రెడ్డి, హరీష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. కోటితో బాక్స్ డ్రైనేజ్ నిర్మాణ పనులు

**మల్కాజిగిరి, జులై 24 ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్‌నగర్‌లో కోటి రూపాయలతో కొనసాగుతున్న బాక్స్ డ్రైనేజ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను, కేబుల్ వైర్లను పక్కకు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిఈ యాదగిరి, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, సంపత్‌రావు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి

**మలక్‌పేట, జులై 24 ప్రభాతవార్త:** ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కంచడానికి కృషి చేస్తామని వికలాంగుల సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని సంస్థ కార్యాలయంలో రాష్ట్రంలోని వికలాంగుల సహకార సంస్థ వివిధ యూనిట్లు, వివిధ జిల్లాలో పనిచేసే ఉద్యోగులందరి సమస్యను తెలియజేయడంతోపాటు సంస్థ బలోపేతానికి సూచనలు చేసారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఉద్యోగులు పేర్కొన్న సూచనలను క్రోడికరించి ప్రభుత్వంతో చర్చించి సంస్థ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. చాలా సంవత్సరాల తర్వాత ఉద్యోగులతో ఛైర్మన్ సమావేశం నిర్వహించడంపట్ల హర్షం వ్యక్తంచేసారు. ఈ కార్యక్రమంలో ఎండి శైలజ, జిఎం ప్రభంజనరావు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పనుల పరిశీలన : కొత్తకాపు అరుణ



పెయింటింగ్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 24 ప్రభాతవార్త:** బోనాలపండుగను పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్‌లోని జయనగర్, గాంధీనగర్, హరిజనబస్తీలలోని దేవాలయాల వద్ద జరుగుతున్న పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేవాలయాల నిర్వాహకులు సూచించిన విధంగా పనులు చేపట్టాలని, పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ బన్సిలాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, బిజెపి ఓబిసి మోర్చా కన్వీనర్ గంగిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌కు చెందిన దళితుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి: కొండేపి శ్రీధర్

**సరూర్‌నగర్, జులై 24 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గాంధీనగర్‌కు చెందిన దళితుడు అంతేర్పుల మహేందర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బిజెపి దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేపి శ్రీధర్ డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేందర్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మహేందర్ సతీమణి దాడి గురించి ఘటనకు పాల్పడిన వారి గురించి ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మీర్‌పేట్ పిఎస్‌ను సందర్శించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలతో జరిగిన దాడిని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపాలని లేని పోంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు అంబేద్కర్, కాశీపేట శివాజీ, కొండ్రు పురుషోత్తం, బచ్చిగళ్ళ రమేష్, కుంటి భాస్కర్, గుండె నాగార్జున బాబులతో పాటు పలువురు పాల్గొన్నారు.